క్లుప్తంగా

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి



నగరం: నిజాంపట్నంలో ఈ నెల 16న జరిగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఎంపీపీ పాల్గొని, మాట్లాడారు. నిజాంపట్నంలో మత్స్యకార భరోసా నాలుగో విడత పంపిణీ కార్యక్రమం సీఎం చేతుల మీదుగా జరుగుతుందన్నారు. మండలంలోని ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

భట్టిప్రోలు: భట్టిప్రోలు కేఎస్‌కే బాలికల జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె. సురేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఇంగ్లీష్, తెలుగు మీడియంలో, సీఈసీ తెలుగు మీడియంలో కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఎంసెట్, నీట్‌కు ప్రత్యేక కోచింగ్ ఇచ్చి మెటీరియల్ అందించబడుతుందని తెలిపారు.

దేవాలయాలు శక్తి కేంద్రాలుగా మారాలి

రేపల్లె: దేవాలయాలు శక్తి కేంద్రాలుగా మారాలని సమరసతా సేవా ఫౌండేషన్ ప్రతినిధి పడమటి వెంకటేశ్వరరావు కోరారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లూరి సౌత్‌లో బుధవారం హిందూ ధర్మ ప్రచార పరిషత్ స్టిక్కర్లను ఇంటింటికీ అందజేశారు. హిందువులు దైవం కోసం కొంత సమయం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, మహిళా కన్వీనర్ లంకా కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయ హుండీ రాబడి లెక్కింపు



భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవాలయ హుండీ రాబడి లెక్కింపు బుధవారం నిర్వహించారు. హుండీలో 12 నెలల అనంతరం ఆదాయం లెక్కింపు జరిపినట్లు దేవాలయ ఈఓ దీవి వేంకట అప్పలాచార్యులు తెలిపారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదు రూ. 30,624లు వచ్చిందని, ఇది గతేడాది కన్నా రూ.10వేలు అధికమని చెప్పారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కుమార్‌బాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి ఉన్నారు.

ఆటో నగర్‌లో చోరీపై కేసు నమోదు

పెదకాకాని: గుంటూరు ఆటోనగర్‌లోని ఓ షాపు తాళాలు పగులగొట్టి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనపై పెదకాకాని పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పెదకాకాని పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంటూరు ఆటోనగర్ లారీ స్టాండ్ సమీపంలో వ్యర్థ పేపర్లు సేకరించి శ్రీదేవి దుకాణం ఉంది. ఇందులో మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షట్టర్ తాళాలు పగలగొట్టి లోపల ఉన్న రూ.25వేల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజ్ఞాన్స్ వర్సిటీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.క్రిష్ణచైతన్యకు తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వీసీ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఇన్వెస్టిగేషన్స్ ఆన్ ఇంప్లాంటబుల్ అండ్ వేరబుల్ ఆంటెనాస్ ఫర్ బయో–మెడికల్ అప్లికేషన్స్ అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని వివరించారు. ఈయన తన పరిశోధనలో భాగంగా మొత్తం 2 ఎస్‌సీఐ, 1 స్కూపస్, 1 ఐఈఈఈ కాన్ఫరెన్స్ పేపర్లు పబ్లిష్ చేశారని వివరించారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్యాయత్నం

గుంటూరు రూరల్: ఇంట్లో పనులు సక్రమంగా చేయటం లేదని తల్లి మందలించటంతో కుమార్తె ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం నగరాలులోని హిమని నగర్‌లో విన్నకోట సుదర్శనరావు, భార్య కళ్యాణి, కూతురు నిహారిక లక్ష్మి నివసిస్తుంటారు. రెండు రోజులుగా ఇంట్లో పనులు సక్రమంగా చేయటంలేదని తల్లి కుమార్తెను బుధవారం ఉదయం మందలించింది. మనస్తాపానికి గురైన కుమార్తె ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. స్థానికులు గమనించి జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సీఎం సహాయనిధి నగదు చెక్కుల పంపిణీ

అందజేసిన మంత్రి మేరుగ నాగార్జున



బాధితురాలికి నగదు చెక్కు అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

దుండిపాలెం(వేమూరు): ప్రమాద బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధులు నుంచి ఆర్థిక సహాయం అందించినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. చుండూరు మండలంలోని దుండిపాలెం గ్రామంలో బుధవారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుండిపాలెం గ్రామానికి చెందిన 14 మహిళా కూలీలు ఫిబ్రవరి 27న ఆటోలో చేబ్రోలు మండలం నారా కోడూరు మిర్చి కోతల కోసం బయలుదేరి వెళ్లారు. గరువుపాలెం చాణక్య హై స్కూలు ఎదురుగా తెనాలి రోడ్డులో ఎదురుగా వస్తున్న వాహనం కూలీల ఆటోను ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో తుమ్మా సామ్రాజ్యం, మండు క్రీస్తు కుమారి, పిట్టు వెంకట రమణ చనిపోవడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కుటుంబానికి రూ.5 లక్షలు అందజేయడం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో తొమ్మిది మందికి గాయాలు కావడంతో వారి కుటుంబాలకు రూ.లక్ష చొప్పున అందజేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.భగవత్ గీత, ఎంపీపీ జాలాది రూబేను, గాదె శివరామకృష్ణ రెడ్డి, చుండూరు గ్రామ సర్పంచ్ ఉయ్యూరి అప్పిరెడ్డి, దుండిపాలెం మాజీ సర్పంచ్ తుమ్మా శ్రీనివాస్‌రెడ్డి, సమ్మెట సాంబ రెడ్డి, డాన్ బాస్కో, కొండ ముది శేఖర్, కె.వెంకటరెడ్డి, తహసీల్దారు దుర్గా రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

శిల్ప కళాకారుడికి సన్మానం



కళాకారుడు మయాచారిని సన్మానించిన భక్తి సమాజం

జంపని(వేమూరు): జంపని గ్రామంలోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో భక్తి సమాజం శిల్పి మయాచారిని బుధవారం ఘనంగా సత్కరించారు. జిల్లా అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి మేడూరు శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ కళాకారుల కుటుంబంలో జన్మించి, దేశ విదేశాలల్లో ప్రఖ్యాత గాంచిన దేవమయాచారి కుమారుడు, రాష్ట్ర ప్రతి అవార్డు గ్రహీత దేవ శంకర్ అని పేర్కొన్నారు. దేవశంకర్ వారసుడిగా మయాచారి మంచి శిల్పా చార్యుడిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. జంపని గ్రామంలో వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఇత్తడి సర్వంగాన్ని సుందరంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు కమ్మ శ్రీనివాసరరావు, గొంది శివరామ కృష్ణ ప్రసాద్, గాదం శెట్టి వెంకట బద్రి సూర్యనారాయణ, యవజన భక్త సమాజం కన్వీనర్ యార్లగడ్డ వర ప్రసాద్, ఆర్యవైశ్య నాయకులు కలవ వెంకట రాధా మధుసూదన్, పాముల పాటి శివరామ కృష్ణ పాల్గొన్నారు.

క్రాఫ్ట్ బజార్ ప్రారంభం



ప్రారంభిస్తున్న బాబురావు, శీలం రోజన్‌బాబు

బాపట్ల అర్బన్: స్థానిక ఏబీఎం హైస్కూల్ గ్రౌండ్‌లో బుధవారం దుడ్డు జాన్ ప్రసన్న బాబురావు, శీలం రోజన్ బాబు ప్రారంభించారు. క్రాఫ్ట్ బజారులో చిన్న పిల్లల ఐటమ్స్, ఖాదీ షర్ట్స్, వరంగల్ టవల్స్, లుంగీలు, బాడీ మసాజ్ ఐటమ్స్, జ్యూయలరీ, మట్టి కుండలు, తదితర వస్తువులు సరసమైన ధరలకు లభిస్తాయని నిర్వాహకుడు జి.జానకి రామయ్య తెలిపారు. బాపట్ల పుర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సొసైటీ అధ్యక్షుడిపై ఎస్పీకి ఫిర్యాదు



బాపట్ల: దగ్గుమల్లివారి పాలెం ఆది ఆంధ్ర కో–ఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీలో జరిగిన అక్రమాలపై సొసైటీ అధ్యక్షుడు గుండాల విజయడేవిడ్ రాజును విచారించాలని సొసైటీ సభ్యులు కోరుతున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందించారు. జాతీయ రహదారి నిర్మాణం సమయంలో సొసైటీ భూముల నుంచి రోడ్డు నిర్మాణం జరగగా.. నష్ట పరిహారం కింద వచ్చిన రూ.1.35కోట్లు దుర్వినియోగం అయ్యాయని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో సభ్యులు దగ్గుమల్లి ధర్మరావు, అడే రవిబాబు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ప్రత్యేక పూజలు

తెనాలిటౌన్: గంగానమ్మ పేటలోని శ్రీ విద్యాపీఠంలో సాలిగ్రామ మఠం వ్యవస్థాపకుడు బాల స్వామిజీ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థాన దాన సాహిత్య ప్రాజెక్టు ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు ఉమారాణి దంపతులు వివాహ మహోత్సవ వేడుకలను జరుపుకున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- హారం, వెండి వస్తువులు, నగదు అపహరణ



దుండగులు పగలకొట్టిన తలుపు



తెరిచి ఉన్న బీరువా

తెనాలిరూరల్: తెనాలిలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇంటిలో పెద్ద మొత్తంలో బంగారం కనబడకపోవడంతో బాధితులు ఆందోళన చెందారు. అయితే ఒక హారం, వెండి వస్తువులు, కొంత నగదు అపహరణకు గురయ్యాయి. ఎక్కువ ఆభరణాలు ఉన్న సంచి ఇంట్లోనే కనబడడంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు. వివరాల మేరకు.. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి బాలాజీరావుపేటలోని మహేంద్రకాలనీకి చెందిన కొలసాని విశ్రాంత ఉపాధ్యాయుడు కొలసాని భూపతి నాయుడు.. హైదరాబాదులోని తన కుమారుడి గృహ ప్రవేశానికి ఈ నెల 2న ఇంటికి తాళాలు వేసి వెళ్లాడు. ఈ క్రమంలో మంగళవారం వీరి ఇంటికి వచ్చిన పని మనిషి తలుపు పగుల కొట్టి ఉండటాన్ని గుర్తించి ఫోన్ ద్వారా వారికి సమాచారం ఇచ్చింది. చోరీ జరిగినట్లు తెలుసుకున్న భూపతి నాయుడు.. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. హైదరాబాద్ నుంచి బుధవారం తెనాలి చేరుకున్నారు. ఇంట్లో చూడగా.. బీరువాలు తెరిచి ఉంచడం, సామాను మొత్తం చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. బీరువాలో ఉండాల్సిన 75 గ్రాముల హారం, 10 గ్రాముల చెవి దిద్దులు కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించారు. వీటితో పాటు కొన్ని వెండి వస్తువులు, రూ. 32 వేల నగదు చోరీకి గురైనట్లు నిర్ధారించారు. అలానే ఇంటి కింద పోర్షన్ లో ఉంటున్న భూపతి నాయుడు తల్లి ఇంట్లో కూడా కొన్ని వెండి వస్తువులు, రూ. 10 వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. అయితే తొలుత 350 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ జరిగిందని భావించారు. ఆభరణాలున్న సంచిని దుండగులు చీరలు, ఇతర వస్త్రాలతో పాటు కింద పడేశారు. అందులోని ఆభరణాలను గుర్తించలేక పోయారు. మొత్తంగా రూ.2లక్షలు విలువ చేసే బంగారు, వెండి వస్తువులు, నగదు చోరీ జరిగినట్లు బాధితులు చెబుతున్నారు. త్రీ టౌన్ సీఐ యు. శ్రీనివాసులు, ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్, సిబ్బందితో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

మహాయజ్ఞం పోస్టర్ ఆవిష్కరణ



పాత గుంటూరు: ప్రజల శ్రేయస్సు కోసం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 12 నుంచి 17 వరకు వరకు జరిగే అష్టోత్తర శత (108) కుండాత్మక చండీ, రుద్ర, రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞంలో గుంటూరు ప్రజలందరూ పాల్గొనాలని ఎమ్మెల్యే షేక్. మహమ్మద్ ముస్తఫా చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం నాజ్ సెంటర్ కొత్తపేటలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలో మహా యజ్ఞానికి సంబంధించిన ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించే మహాయజ్ఞంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.శ్రీనివాసరావు, చైర్మన్ పి.జయ ప్రకాష్ రెడ్డి ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకట రత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, హనుమాన్ దీక్ష సమాజం అధ్యక్షులు తిరువల్లూరి వెంకట సుబ్బారావు, సభ్యులు అనిల్ కుమార్, నాగేశ్వర రావు, వెంకట రమణ, ప్రసాద్ పాల్గొన్నారు.

కార్యదర్శులకు బాధ్యత లేదా

గృహనిర్మాణాల విషయంలో డీపీఓ కేశవరెడ్డి ప్రశ్న



పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ప్రశ్నిస్తున్న డీపీఓ కేశవరెడ్డి

ప్రత్తిపాడు: గృహ నిర్మాణాల విషయంలో కార్యదర్శులు ఎందుకు శ్రద్ధ చూపడం లేదని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.కేశవరెడ్డి ప్రశ్నించారు. ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం డీపీఓ కేశవరెడ్డి జగనన్న గృహ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయాల వారీగా పురోగతిపై సమీక్షించారు. యనమదలలో తొమ్మిది గృహాలు శ్లాబ్ వరకు వచ్చి, శ్లాబ్ పూర్తి కాకుండా నెలల తరబడి ఉండటంపై ఆ గ్రామ కార్యదర్శితోపాటు ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ప్రశ్నించారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ముందు ఇక్కడి నుంచి బయటకు వెళ్లిపోండి.. అంటూ మండిపడ్డారు. మొన్నటి వరకు పంచాయతీ కార్యదర్శులకు పన్నుల వసూళ్లలో నిమగ్నం కావడంతో ఒత్తిడి చెయ్యలేదని, కానీ ఇప్పుడు కార్యదర్శులు ఎందుకు బాధ్యత తీసుకోవడం లేదని ఆగ్రహించారు. గ్రామ సచివాలయాల్లోని ఫంక్షనల్ అసిస్టెంట్లును సంబంధిత గ్రామంలోని వలంటీర్లతో ట్యాగ్ చేసినప్పటికీ ప్రగతి కనిపించకపోవడం సరికాదన్నారు. వచ్చే సమావేశానికి ఆయా లే అవుట్లకు సంబంధించిన స్పెషల్ ఆఫీసర్లు కూడా హాజరు కావాలని, వారి సమక్షంలోనే సమీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణంలో పురోగతి కనిపించాల్సిందేనని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీరమ్య, హౌసింగ్ ఏఈ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



గుంటూరు రూరల్: చోరీలు చేసే అలవాటు ఉందని యజమాని పనిలోంచి తీసేయడంతో మనస్తాపానికి గురైన మహిళ పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రానికి చెందిన యరగాని సరస్వతి, ఆమె భర్త రామకృష్ణ నగరంలోని మిర్చియార్డు వద్ద నున్న ఎమ్ఎస్ఆర్ మిర్చి కమీషన్ కొట్టు, శ్రీ రామ చిల్లీస్‌లో కాపలా పనికి కుదిరారు. రెండు నెలల క్రితం ఆ దుకాణం ముందు నిలిపిన ఒక ద్విచక్రవాహనంలో రూ.4,70 లక్షలు అపహరణకు గురయ్యాయి. దీంతో బాధితుడు అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా చోరీ చేసింది రామకృష్ణే అని తేలింది. దీంతో అతని వద్దనుంచి నగదును రికవరీ చేశారు. అనంతరం రామకృష్ణను పని నుంచి యజమాని తీసివేశారు. నగదు రికవరీ అనంతరం రామకృష్ణ యజమాని వద్దకు వచ్చి చేసిన తప్పు ఒప్పుకుని కేసును కోర్టులో కొట్టేయించాలని రాజీ కోరారు. దీంతో యజమాని రాజీపడి లోక్‌అదాలత్ ద్వారా చోరీ కేసును కొట్టివేయించారు. తమ కాపలా పని తమకు మళ్లీ ఇప్పించాలని రామకృష్ణ, అతని భార్య సరస్వతి యజమానిని కోరారు. దీనికి యజమాని నిరాకరించడంతో మనస్థాపానికి గురైన సరస్వతి పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. స్థానికులు గమనించి 108లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు బాధితురాలి పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నరహరి తెలిపారు.

అభినందన



గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టుగా, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ వై షేక్ అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని కొనియాడారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ సెల్ విభాగం ఆధ్వర్యంలో 70 మందికిపైగా వైద్యులను డాక్టర్ వై షేక్ పార్టీలో చేర్పించారు. జిల్లా వ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఈనేపథ్యంలో బుధవారం మంత్రి విడదల రజిని చిలకలూరిపేటలోని తన కార్యాలయంలో డాక్టర్ వై షేక్‌ను శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మెరుగైన సేవలందించాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

– గుంటూరు మెడికల్

మహా యజ్ఞాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ, పక్కన జెడ్పీటీసీ

భట్టిప్రోలు: ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో జరగనున్న అష్టోత్తర శత కుండాత్మక (108) చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన శ్రీలక్ష్మీ మహా యజ్ఞంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి కోరారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం, రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండేందుకు దేవాదాయ శాఖ తలపెట్టిన మొట్టమొదటి మహా యజ్ఞాన్ని జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ నాలుగు రోజులు మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, దేవాలయ ఈఓ దీవి వేంకట అప్పలాచార్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు నాగమల్లేశ్వరరావు, బాలాజి పాల్గొన్నారు.

13 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలో 1880లో గట్టుపల్లి వెంకయ్య పంతులు.. క్షీర భావనారాయణ స్వామి అభిముఖంగా ప్రతిష్ఠించిన సువర్చలా సమేత ప్రసత్యాంజనేయస్వామి 74వ వార్షిక హనుమజ్జయంతి, కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 13 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నట్లు మారుతీ రామ బాలభక్త సమాజం అధ్యక్షుడు నెమలికంటి హనుమంతరావు, ఆలయ అర్చకులు శ్రీనివాసులు బుధవారం వెల్లడించారు. 13న ఉదయం 7 గంటలకు పంచామృత స్నపన, 8 గంటలకు నగరోత్సవం ఉంటుందని వెల్లడంచారు. 14న హనుమజ్జయంతి ఉదయం 6 గంటలకు సిందూరార్చన, 8 గంటలకు సింహ వాహనంపై నగరోత్సవం, సాయంత్రం 4 గంటలకు విశేష ఫలప్రద నానావిధ పుష్పయుక్త సర్వఫలార్చన, 6 గంటలకు ఒంటె వాహనంపై నగరోత్సవం ఉంటుంది. 15న ఉదయం 8 గంటలకు శ్రీసువర్చలా హనుమత్ కల్యాణం, సాయంత్రం 6 గంటలకు గజవాహనంపై నగరోత్సవం ఉంటుంది. 16న సాయంత్రం 6 గంటలకు కుప్పిగంతుల సేవ తిరునాళ్ల ఉంటుంది. 17న ఉదయం 7 గంటలకు శాంతి హోమం, మధ్యాహ్నం 12 గంటలకు సామూహిక అన్నసంతర్పణ సాయంత్రం 6 గంటలకు శేషవాహనంపై నగరోత్సవం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలోపాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు

గాజులపేట(భట్టిప్రోలు): పెద పులివర్రు పంచాయతీ పరిధిలోని గాజుల పేటలో అభయాంజనేయస్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, నిత్య విశేష హోమాలు జరిగాయి. సాయంత్రం గ్రామోత్సం, మహా శాంతి హోమం ఘనంగా చేశారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు. గురువారం విగ్రహ ప్రతిష్టా మహోత్సవం జరుగుతుందని తెలిపారు.

కళాకారిణి శారదా చలపతికి సన్మానం



శారదా చలపతిని సన్మానిస్తున్న రజని, శివనాగలక్ష్మి

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం మేజర్ చంద్రకాంత్ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం సంపూర్ణ రామాయణం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం గాయని, కళాకారిణి, సంకీర్తనాపరురాలు ఉప్పలూరి శారదా చలపతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమ్మెల రజని, చక్రాల శివనాగలక్ష్మి, మహాలక్ష్మి, పంచుమర్తి భాస్కరరావు, బిట్రా యుగంధర్, ఉప్పలూరి శేషాచలపతి, ముద్దా భక్తుని రమణయ్య, ఒగ్గు వెంకట కృష్ణారావు, కొతరపు లీలాకృష్ణ, సూర్యదేవర లీలావతి, ఉమ్మలనేని ధర్మారావు, ఎన్‌సీసీ వెంకట్, పెమ్మసానీ పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవానీ, ఈదర శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

14న హనుమాన్ శోభాయాత్ర

తెనాలి: హనుమజ్జయంతి సందర్భంగా ఈ నెల 14న తెనాలిలో జరగనున్న శోభాయాత్రను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ కోరారు. స్థానిక ఉప్పు బజారులో బుధవారం సాయంత్రం శోభాయాత్ర కమిటీ సభ్యులతో కలిసి శ్రీహనుమాన్ శోభాయాత్ర వాల్ పోస్టరును ఆయన ఆవిష్కరించారు. గతేడాది ఎంతో వైభవంగా శోభాయాత్ర జరిగిందని, ఎందరో భక్తులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేసినట్లు గుర్తుశారు. అదేవిధంగా ఈ నెల 14న సాయంత్రం 4 గంటలకు సుల్తానా బాద్‌లోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. అక్కడ్నుంచి బైక్ ర్యాలీతో శోభాయాత్ర పట్టణ వీధుల్నుంచి బోసు రోడ్డులోని చిట్టి ఆంజనేయస్వామి గుడి వరకు కొనసాగుతుందదని వివరించారు. కమిటీ సభ్యులు అన్నవరపు వేణు, వేమా సురేష్‌బాబు, కొత్తమాసు రామకృష్ణ, కాళిదాసు వెంకటేశ్వర రావు, కొడాలి క్రాంతి, శనగపల్లి నాగేశ్వరరావు ప్రభృతులు పాల్గొన్నారు.